క్లుప్తంగా

గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలి



అమరావతి: గ్రామాలలో కార్యకర్తలు, నాయకులు వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు కృషి చేయాలని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సతీమణి వసంతకుమారి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం మండల పరిధిలోని ఉంగుటూరులో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి నేటి వరకు కార్యకర్తలు, నాయకులు వెన్నుదన్నుగా నిలిచారన్నారు. బూత్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు కార్యకర్తలు తమ పరిధిలో ఇంటింటికి తిరిగి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వారు పొందిన లబ్ధిని వివరించాలన్నారు. అలాగే తమ బూత్ పరిధిలో ఓటర్లకు పోలింగ్‌బూత్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు ఎలా వెయ్యాలో అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన పథకాలు ప్రతిపక్ష పార్టీ చేసిన మోసాలను ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికలకు సమయం చాలా తక్కువ ఉందని ప్రతి కార్యకర్త ఒక సైనికుని వలె గ్రామ స్థాయిలో అన్ని సామాజిక వర్గాలను కలుపుకుని పార్టీ గెలుపుకు కృషి చేయాలన్నారు. టీడీపీ అనేక కుతంత్రాలకు, కుట్రలకు పాల్పడే అవకాశం ఉందని కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. తొలుత గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగన్‌మోహన్‌రెడ్డికి, శంకరరావుకు అండగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ నాయకుడు రాయపాటి శివ, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అమరావతి: మండల పరిధిలోని లేమల్లె గ్రామం వద్ద 33 కేవీ నూతనలైన్ల నిర్మాణం కారణంగా సోమవారం మండల పరిధిలోని అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ శాఖ ఏఈ అశోక్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని గ్రామాలలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

చెట్టును ఢీకొట్టిన కారు



గోళ్ళపాడు(ముప్పాళ్ళ): మండలంలోని గోళ్ళపాడు కేజీబీవీ పాఠశాల సమీపంలో కారు చెట్టును ఢీకొన్న ఘటన ఆదివారం తెల్లవారుజామున జరిగింది. నరసరావుపేట నుంచి వేగంగా వస్తున్న కారు మార్జిన్‌లోని చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి సురక్షితంగా బయటపడ్డట్లు సమాచారం.

దేవరంపాడు దేవస్థానం హుండీల లెక్కింపు

రాజుపాలెం: దేవరంపాడు కొండపై మత్స్యా రూపంలో వేంచేసి ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం నాల్గవ శనివారం తిరునాళ్ల జరిగింది. ఆదివారం దేవస్థానంలోని హుండీలను లెక్కించగా రూ.14,50,991 ఆదాయం వచ్చినట్లు ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ లెక్కింపులో దేవస్థానం ఫెస్టివల్ అధికారి వి.లీలావతి, దేవస్థానం కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నకరికల్లు: తెలుగు సంవత్సరాది ఉగాది ప్రాముఖ్యతను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని, త్రైత సిద్ధాంత భగవద్గీతను పఠించాలని ప్రబోధ సేవాసమితి ఇందూ /ానవేదిక పిడుగురాళ్ల కమిటీ అధ్యక్షుడు కటికం సైదారావు అన్నారు. త్రైత సిద్ధాంతం- ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక పిడుగురాళ్ల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని రూపెనగుంట్ల గ్రామంలో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచార కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రిమత ఏకైక గురువు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాలను రచించారన్నారు. ఉగాదిగా పిలువబడే యుగాది అంటే యుగానికి ఆది అని అన్నారు. ఉగాది రోజు ఆరు రుచుల ప్రసాదాన్ని దేవునికి నివేదించి మోక్షానికి దగ్గర చేయమని ప్రార్థిస్తారని తెలిపారు. కమిటీ సభ్యులు కె.అరుణ, కె.కోటేశ్వరరావు, కె.నారాయణమ్మ, కె.గోపి, డి.శ్రీను, ఎం.వీరయ్య, ఎస్.వెంకటలక్ష్మి, సీహెచ్ అనురాధ, టి.రాఘవ, ఎం.అమర్, బి.చిరంజీవి, బి.శివ, వై.రామాంజనేయులు, కె.గంగయ్య పాల్గొన్నారు.

దళితులకు తెలుగుదేశం పార్టీలో గుర్తింపు లేదు

- వైఎస్సార్‌సీపీ గూటికే చేరిన కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్
- టీడీపీలో చేరి ఇమడలేక నలిగిపోతున్న నాయకులు
- వైఎస్సార్‌సీపీ పేద, బడుగు, బలహీన వర్గాల పార్టీ
- రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్‌కు పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: తెలుగుదేశం పార్టీలో దళిత వర్గాలకు తగిన గుర్తింపు లేదని, ఆత్మగౌరవం కోల్పోయి అక్కడ నిలబడలేమని 11వ వార్డు కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ అన్నారు. ఆదివారం ఆయన తెలుగుదేశం పార్టీని వీడి తిరిగి వైఎస్సార్‌సీపీలో చేశారు. కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్ కొద్ది రోజుల క్రితం స్థానిక కారణాలతో టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ సమక్షంలో టీడీపీ కండువా కప్పుకున్నారు. కొద్ది రోజులు అక్కడ పనిచేశారు. అక్కడ ఎంత కష్టపడ్డా గుంటూరు నుంచి వచ్చిన వారికి, ఆ పార్టీ సామాజిక వర్గానికి తప్ప ఇతరులను గౌరవించడం లేదన్నారు. కౌన్సిలర్ గుజ్జర్లపూడి సతీష్‌ను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సాదరంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పారు. అంబటి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పేదల, దళితుల, బడుగు, బలహీన వర్గాల పక్షపాతి అన్నారు. పేదల పక్షాన నిలబడిన ఏకైక నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. టీడీపీ పట్టుచీరలు, అంచుపంచెలు, కోటీశ్వరులు ఉండే పార్టీ అని విమర్శించారు. అక్కడ పేద వర్గాలకు స్థానం లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు సముచిత స్థానం కల్పించి ప్రోత్సహిస్తుందన్నారు. స్థానిక నాయకులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సతీష్‌కు సూచించారు. అనంతరం మంత్రి అంబటి రాంబాబు, నిమ్మకాయల రాజనారాయణను సతీష్ శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గుంటూరు మిర్చి యార్డ్ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగుర్‌మీరాన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పెండెం బాబురావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు చిలుకా జైపాల్, కోడిరెక్క దేవదాస్, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, నాయకులు గడ్డం వెంకటేశ్వర్లు, గంటా ఏసుబాబు, షేక్ జానీ, తుమ్మల వెంకటేశ్వరరావు, శిరిగిరి వెంకట్రావు, వల్లెం నరసింహారావు తదితరులు ఉన్నారు.

సంక్షేమ ప్రభుత్వానికి అండగా నిలవండి



పట్టణంలోని ఒకటవ వార్డులో ఎన్నికల ప్రచారంలో అంబటి విజయలక్ష్మి

సత్తెనపల్లి: కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తూ.. అందరి మంచి కోరే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మరోసారి ఆశీర్వదించాలని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సతీమణి అంబటి విజయలక్ష్మి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఒకటో వార్డులో ఆదివారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఇంటింటికి ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంచారు. సీఎం జగన్ ప్రభుత్వంలో సంక్షేమ ఫలాలు ఇంటి వద్దకే అందుతున్నాయన్నారు. పొరపాటున టీడీపీ అధికారంలోకి వస్తే గతంలో మాదిరి జన్మభూమి కమిటీల పెత్తనంతో అర్హులకు మొండిచేయి తప్పదన్నారు. టీడీపీకి ఓటు వేస్తే మళ్లీ చీకటి రోజులు తప్పవన్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ.. సంక్షేమ పథకాలు వివరిస్తూ ముందుకు సాగారు. వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ గీతాహాసంతి మాట్లాడుతూ నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా వివిధ సంక్షేమ పథకాలు రూపొందించి అమలు చేయడంతో పాటు అభివృద్ధికి పెద్దపీట వేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ మాత్రమేనని, ప్రతిపక్ష పార్టీలు సాధ్యం కానీ హామీలతో ప్రజలను మోసం చేసేందుకు కూటమిగా వస్తున్నాయని, వారి మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా సంక్షేమ పాలన అందించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. నియోజకవర్గంలో అవినీతి రహితంగా పారదర్శక పాలన అందించిన మంత్రి, ఎమ్మెల్యే అభ్యర్థి అంబటి రాంబాబును, మాజీ మంత్రి, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పి.అనిల్ కుమార్‌యాదవ్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మంత్రి అంబటి రాంబాబు తనయ మనోజ్ఞ, మున్సిపల్ చైర్ పర్సన్ చలంచర్ల లక్ష్మీతులసి, వార్డు కౌన్సిలర్ వరికల్లు కోటేశ్వరరావు, 30వ వార్డు ఇన్‌చార్జ్ ఉల్లంఘుల జయలక్ష్మి, పార్టీ నాయకులు కాటుమాల డేవిడ్, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

రాంబాబన్న.. గుండెల్లో ఉన్నావన్నా..

పాట సీడీని ఆవిష్కరించిన మంత్రి అంబటి రాంబాబు



పాట సీడీని ఆవిష్కరిస్తున్న మంత్రి అంబటి రాంబాబు

సత్తెనపల్లి: యుద్ధానికి సిద్ధం అంటూ 'అంబటి రాంబాబన్న మా గుండెల్లో ఉన్నావన్నా' అనే పల్లవితో యువతరం, వైఎస్సార్‌సీపీ శ్రేణుల గుండెలకు హత్తుకొనేలా ఉన్న పాటను రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆవిష్కరించారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ పరిశీలకుడు, పల్నాడు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పడాల శివారెడ్డి ఆధ్వర్యంలో శ్రీనివాస్ మాలపాటి స్వీయ సంగీత నేపథ్యంలో ఆలపించారు. సీడీని ఆవిష్కరించిన అనంతరం మంత్రి అంబటి రాంబాబు ఆ పాట విని శ్రీనివాస్‌ను అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు, తదితరులు ఉన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



పార్టీలో చేరిన రామాంజనేయపురం నాయకులతో ఎమ్మెల్యే నంబూరు



వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలతో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: తెలుగుదేశం పార్టీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలోకి మండలంలోని పలు గ్రామాల నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుతున్నారు. ఆదివారం మండలంలోని రామాంజనేయపురం, పాపాయపాలెం, నందిరాజుపాలెం గ్రామాల టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామాంజనేయపురం నుంచి పోలేపల్లి శంకర్, దొడ్డేటి కోటి, గోపి, కన్నా ఏసుబాబు, లట్టుపల్లి వెంకన్న, మద్దిరాల రాజు, కొత్తూరు బుజ్జి, ఎగిరిశెట్టి బాలస్వామి, భూక్యా శ్రీను కుటుంబాలు చేరాయి. పాపాయపాలెం గ్రామానికి చెందిన బి.నాగేంద్రబాబు, ఏడుకొండలు, భూలక్ష్మీ, పవన్‌కుమార్, ప్రసాద్, కొండమ్మ, ప్రవళ్లిక, ప్రసాద్, సీతారావమ్మ, నాగమ్మ, రాంబాబు, పూర్ణ, శివకృష్ణ, నాగలక్ష్మీ కుటుంబాలకు చెందిన వారు పార్టీలో చేరారు. నందిరాజుపాలెం నుంచి టీడీపీ క్రియాశీల కార్యకర్త బెల్లంకొండ గోపి వైఎస్సార్‌సీపీలో చేరాడు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారం రమణారెడ్డి, బొడ్డుపల్లి రాము, బోనం వెంకట్రామిరెడ్డి, కంపా ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీ అక్కల వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ బూదాటి మరియదాసు, దండా సత్యనారాయణ రెడ్డి, సుబ్బయ్య, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పాపాయపాలెం నాయకులను పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అమరావతి: స్థానిక జగ్జీవన్‌రామ్ కాలనీకి చెందిన 43 మంది టీడీపీ కార్యకర్తలు పెదకూరపాడు శాసనసభ్యుడు నంబూరు శంకరరావు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం జగ్జీవన్‌రామ్ కాలనీలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన రాచపూడి బాబురావు, నాగేశ్వరరావు, చంటి, కొండా, సాంబశివరావు, ఏసు, మరియమ్మ, చిన్నమ్మాయి, విజయమ్మ, మేరి, పలుకూరి శివ, కారసాల బాలరాజు, భట్లూరి అనిల్ తదితరులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ పేదల కష్టాలు తెలిసిన జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలన్నారు. గత ఐదేళ్ల పాలనలో పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేశామన్నారు. జగనన్న అందించిన సంక్షేమ, అభివృద్ధి పథకాల వల్ల ప్రజలలో వైఎస్సార్‌సీపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. అందుకు ప్రతిరోజు వందలాది మంది పార్టీలో చేరటమే నిదర్శనమన్నారు. రాష్టంలో ప్రతి పేద కుటుంబానికి సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చటమే లక్ష్యంగా ఐదేళ్లు పనిచేశామన్నారు. కార్యకర్తలు, నాయకులు మనం ప్రజలకు అందించిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఇంటింటికి వివరించాలన్నారు. ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా వైఎస్సార్‌సీపీ గెలుపుకోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, పార్టీ నాయకులు నిమ్మా విజయసాగరబాబు, పలుకూరి రోశిబాబు, నంబూరు కరుణ కుమార్, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో రెండు పూరిళ్లు దగ్ధం



అగ్నిప్రమాదంలో కాలిబూడిదయిన ఇళ్లను చూస్తున్నఎమ్మెల్యే నంబూరు శంకరరావు

పీసపాడు(క్రోసూరు): మండలంలోని పీసపాడు ఎస్సీ కాలనీలో ఆదివారం షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండు పూరిళ్లు కాలి బూడిదయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మీనారాయణ, శివయ్యలకు చెందిన రెండు పూరిళ్లు అగ్నిప్రమాదం సంభవించి కాలిపోయాయి. ఇళ్లలోని వారందరూ పనులకు వెళ్లిన సమయంలో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఇళ్లు పూర్తిగా కాలిపోవటంతో కట్టుబట్టలతో మిగిలారు. అగ్నిప్రమాదంలో డబ్బు,ఆస్తి నష్టం సుమారు రూ.5 లక్షలు ఉండవచ్చునని తెలిసింది. సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఘటన స్థలానికి చేరుకున్నారు. జరిగిన సంఘటన పట్ల తీవ్ర విచారం వ్యక్తపరిచారు. బాధితులకు ఇందిరా ఆవాస్ యోజన మంజూరు చేయిస్తామన్నారు. రేషన్‌డీలరు రాజశేఖరరెడ్డి రెండు కుటుంబాలకు బియ్యం అందజేసారు. వీఆర్వో, తహసీల్దార్ ఘటన స్థలానికి చేరుకోలేదని స్థానికులు చెప్పారు. క్రోసూరు, సత్తెనపల్లి మండలాల అగ్నిమాపక యంత్రాలు సమయానికి అందుబాటులో లేకపోవటం, ఎండలు తీవ్రంగా ఉండటంతో క్షణాల్లో మంటలు ఎగసిపడి రెండు పూరిళ్లే కాలి బూడిదయ్యాయి. ఘటన ప్రదేశానికి ఎమ్మెల్యేతో పాటు వైస్ ఎంపీపీ విప్పల వెంకట్రామిరెడ్డి, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించారు.

ఇస్లాం తోటివారి పట్ల ప్రేమ, దయ నేర్పిస్తుంది



ప్రత్యేక నమాజు చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

క్రోసూరు: పవిత్ర రంజాన్ మాసంలో తోటి వారి పట్ల ప్రేమ, దయ, క్షమా గుణాల సువాసనలు అందజేస్తుందని ప్రతి ఒక్కరు తెలుసుకోదగిన సత్యమని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. ఆదివారం క్రోసూరు గ్రామ ముస్లింలకు స్థానిక షాదీఖానాలో ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముస్లిం మత పెద్దలతో ప్రత్యేక నమాజు ఆచరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ఇస్లాం మనిషి ఎలా ఉండాలో నడివడికను నేర్పిందని అన్నారు. ప్రతి ఒక్కరు పేద, ధనిక తేడాలేకుండా ఈ మాసంలో దేవుని ధ్యానంలో గడుపుతూ , ఐదుపూటల నమాజు ఆచరిస్తూ, ఉపవాసముంటారని అన్నారు. ఉపవాసం ఉండటం వలన తోటి వారి ఆకలి, కష్టం తెలుస్తుందన్నారు. కోపతాపాలు విడనాడి, ప్రేమ, దయ, క్షమ గుణం కలిగి ఉండాలని ఇస్లాం బోధిస్తుందని తెలుసుకున్నానని అన్నారు. అంతటి గొప్ప కార్యక్రమాలు ముస్లిం సోదరులు, వారి కుటుంబాలు ఎంతో పవిత్రంగా రంజాన్ మాసంలో ఆచరించటం గొప్ప కార్యక్రమమని చెప్పారు. ముస్లింలు ఎల్లవేళలా బాగుండాలని కోరుకుంటానని తెలిపారు. ముస్లిం కుటుంబాలకు ఎల్లప్పుడు అండగా ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ముస్లిం పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి కె. పాపయ్య



మంచికల్లు గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి పాపయ్య, సిబ్బంది

రెంటచింతల: మండలంలోని వివిధ గ్రామాలలో 2024 మే 13న నిర్వహించనున్న సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల ఎన్నికల నియమ నిబంధనల పర్యవేక్షణ(ఫ్లయింగ్ స్క్వాడ్) అధికారి కె.పాపయ్య అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని మంచికల్లు, పాలువాయిగేటు గ్రామాలలో పర్యటించి ఎన్నికల ప్రవర్తన నియమాలపై ఆయా కాలనీ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ మా బృందం 2024 మే 13న సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు మండలంలోని గ్రామాలలో పర్యటిస్తూ ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పటిష్టంగా అమలు చేస్తుందన్నారు. మండల ప్రజలను ప్రశాంతంగా వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకునే విధంగా చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలలో భారీగా నగదు, మద్యం, ఇతర వస్తువులు తరలించడం నేరమని గుర్తుంచుకోవాలన్నారు. గ్రామాలలో ఎక్కడైనా ఎన్నికల కోడ్ ఉల్లంఘన జరుగుతుంటే భారత ఎన్నికల సంఘం నూతనంగా ఏర్పాటు చేసిన సి-విజిల్ యాప్ ద్వారా సమాచారం ఇచ్చినట్లయితే వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం క్షేత్రస్థాయిలో స్పందిస్తుందన్నారు.

హరియాణ మద్యం పట్టివేత

నరసరావుపేట టౌన్: అక్రమంగా మద్యం కలిగి ఉన్న కేసులో నలుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.60 వేలు విలువైన 42 హరియణ మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి ఆదివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు మోర్ సెంటరులో దాడులు నిర్వహించి, అక్రమంగా మద్యం కలిగి ఉన్న నూకల రామిరెడ్డి, మౌలాలి, ప్రకాష్, మహేష్‌ను అరెస్ట్ చేసి వారి నుంచి 42 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు. అలాగే నకరికల్లు గ్రామంలో దాడులు నిర్వహించి, అక్రమంగా మద్యం కలిగి ఉన్న బి. వెంకటరమణను అరెస్ట్ చేసి, అతని నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఈబీ సీఐ నయనతార తెలిపారు.

సిద్ధం సభను విజయవంతం చేయాలి

నగర పంచాయతీ వైస్ చైర్మన్ బడేజానీ

గురజాల : ఈనెల 10వ తేదీన పిడుగురాళ్లలో జరుగు సిద్ధం సభను విజయవంతం చేయాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ షేక్ బడేజానీ కోరారు. ఆయన తన కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిద్ధం సభలో ముస్లిం సోదరులు వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ సభలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ముస్లింల అభ్యున్నతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతగానో కృషి చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ముస్లిం మైనార్టీ మండల నాయకుడు షేక్ నాగులుమీరా, మండల కోఆప్షన్ మెంబర్ షేక్ పీర్ అహ్మద్, మీర్‌సా, వలి ఉన్నారు.

ముగిసిన పింఛన్ల పంపిణీ

గురజాల : పింఛన్‌దారులకు పెన్షన్ సొమ్ము అందకుండా చంద్రబాబునాయుడు వేసిన ఎత్తులు ఫలించలేదు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వలంటీర్లు పింఛన్‌దారుల ఇళ్లకు వెళ్లకుండా ఎన్నికల సంఘం (ఈసీ) ద్వారా నిలువరించారు. దీంతో వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు పింఛన్ సొమ్ము కోసం మండుటెండల్లో సచివాలయాలకు వెళ్లాల్సివచ్చింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబునాయుడు ఎత్తుగడను, పింఛన్‌దారుల ఇబ్బందులను గుర్తించి పింఛన్ పంపిణీలో జాప్యం జరగకుండా సత్వర చర్యలు చేపట్టింది. సచివాలయాల్లో వీరికి పింఛన్ సొమ్ము వెంటనే అందేలా చర్యలు చేపట్టారు. పింఛన్‌దారులకు సచివాలయాల వద్ద షామీయానాలు, కుర్చీలు, మంచినీరు వంటివి సమకూర్చి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టారు. సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోలేని వృద్ధులు, వికలాంగులు అనారోగ్యంతో మంచాన పడిన వారికి వారి ఇళ్ల వద్దే పింఛన్ డబ్బులు అందించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అలాంటి వారిని గుర్తించి సచివాలయాల సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి పింఛన్ అందించారు.

ఘనంగా మాసశివరాత్రి



విశేష అలంకణలో నర్శింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి వారు



ప్రత్యేక అలంకరణలో గంగా అన్నపూర్ణాదేవి అమ్మవారు

నకరికల్లు: మండలంలోని నర్శింగపాడు గ్రామంలో వేంచేసి ఉన్న గంగా అన్నపూర్ణా సమేత మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి దేవస్థానంలో మాసశివరాత్రి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఫాల్గుణమాస మాసశివరాత్రి పురస్కరించుకొని అర్చకులు పమిడిమర్రు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ విశేషద్రవ్యములతో స్వామివారికి అభిషేకాలు చేశారు. స్వామివారిని అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మాసశివరాత్రి పురస్కరించుకొని భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి పొంగళ్లు పొంగించారు. విశేష అలంకరణలో ఉన్న స్వామి వార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమ జంట

యడ్లపాడు: తమ కుటుంబ పెద్దల నుంచి రక్షణ కల్పించాలంటూ ఓ ప్రేమ జంట పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన కథనం మేరకు.. యడ్లపాడు మండలం సొలస గ్రామానికి వేర్వేరు కులాలకు చెందిన యువతి, యువకుడు ప్రేమించుకున్నారు. ఈ నేపథ్యంలో గత నెల 29న ఇద్దరు పెద్దలకు తెలియకుండా ఊరు విడిచి వెళ్లారు. దీంతో యువతి తల్లి తన కుమార్తె కనిపించడం లేదని ఈ నెల 2న పోలీసులు ఫిర్యాదు చేసింది. కులాంతర వివాహం చేసుకున్న ప్రేమికుల జంట ఆదివారం నేరుగా యడ్లపాడు పోలీస్ స్టేషన్‌కు వచ్చి రక్షణ కోరారు. తామిద్దరం మేజర్లమేనని ఇద్దరి ఇష్ట ప్రకారంగానే పెళ్లి చేసుకున్నామని..తమ కుటుంబ సభ్యులనుంచి ఇబ్బంది లు రాకుండా రక్షణ కల్పించాలని ఎస్ఐ జి.శామ్యూల్ రాజీవ్‌కుమార్‌ను కోరారు. దీంతో పోలీసులు యువతి తల్లిని పోలీస్ స్టేషన్ పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. తాము కలిసి జీవించాలని నిర్ణయించుకున్నట్లు ప్రేమ జంట స్పష్టం చేసింది.

మాస శివరాత్రి వేడుకలు

రొంపిచర్ల: మండలంలోని శివాలయాల్లో ఆదివారం మాస శివరాత్రి వేడుకలు నిర్వహించారు. విప్పర్ల గ్రామంలోని గంగాపార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి పంచామృత సహిత మహన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. అలాగే శనివారం రాత్రి శని త్రయోదశి పురస్కరించుకొని నందీశ్వర సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో పలువురు భక్తులు పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక అలంకరణలో మూల విరాట్‌లను భక్తులు దర్శించుకున్నారు.

ఎస్సీలను మోసం చేసిన షర్మిల

దాచేపల్లి : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఎస్సీలను మోసం చేసిందని ఆ పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు కె.ఫ్యూజన్ ఆరోపించారు. ఈ మేరకు పార్టీ పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి తాను రాజీనామా చేసినట్లు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్సీల మనోభావాలను దెబ్బతీసేలా షర్మిల వ్యవహరిస్తుందని, ఎస్సీలకు అసలు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యత లేకుండా షర్మిల చేస్తుందని మండిపడ్డారు. ఎస్సీలను మోసం చేసిన కాంగ్రెస్‌కి, రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిలకి రాజకీయంగా పుట్టగతులుండవని ఆయన ధ్వజమెత్తారు.